# కోరిక

– అద్దేపల్లి సుచిత్రాదేవి

"నన్ను చూసి మా ఫ్రెండ్సంతా ఈర్ష్యపడుతూంటారు తెలుసా?"

"ఎందుకుట?'

"ఇంతటి అందాలరాశిని భార్యగా పొందినందుకు" మాధురిని తన వైపు లాక్కుంటూ అన్నాడు మాధవ్.

"సంబరమే. కానీ నా స్నేహితురాళ్ళంతా నన్ను చూసి సానుభూతిపడుతుంటారు తెలుసా?" భర్త నుంచి దూరంగా జరుగుతూ చిరుకోపంతో అన్నది మాధురి.



"ఆదేం? నీ అందానికి నేను తగిన వాడిని కాదనా?" అతను విస్తుపోతూ అడిగాడు.

"బడాయి. మీ అందం గురించి పొగిడించుకు నేందుకేనా? ఇంతటి అందాలరాశిని పొందిన ఈ అందాల రాముడు నెలలోని నాలుగు వారాలలో మూడు వారాలు వూర్లూ, టూర్లూ అంటూ తిరుగుతూ ఈ యవ్వనాన్నంతా వృథా చేస్తున్నాడనీ..." దీర్ఘం తీసింది.

ఇంకా ఏమిటో అనుకున్నతను ఆమె మాటలకి పకపకా నవ్వేడు.

"పాపం రాణీగారి అందమంతా అడవిగాచిన వెన్నెలైపోతుందటనా?"

"నేనేం అడవిలో లేనుగా. జంట లేక బెడ్‌రూం గాచిన వెన్నెలైపోతుందట" మాధురి కూడా నవ్వింది.

"ప్చ్. ఏం చేస్తాం నా ఉద్యోగం అలాంటిది. అయినా అందుకే కదోయ్ ఆ మూడు వారాల ముచ్చటా ఈ ఒక్క వారంలో తీర్చేస్తున్నాను."

ఆమెను దగ్గరకు లాక్కోబోయాడు.

"వద్దు బాబోయ్ వద్దు. ఈ రోజుకిక చాలు. నా వల్లకాదు. ఈ అతివృష్టి, అనావృష్టికి నేను తట్టుకోలేను" నవ్వుతూ పారిపోబోతున్న ఆమెని గట్టిగా పట్టి ఆపేశాడు.

"అప్పుడే అతి అంటే ఎలా? ఇది కుంభవృష్టి అని చెప్పానా?" ఆపై ఆమెకు మాట్లాడే అవకాశమే రాలేదు.

***

అలా ప్రశాంత నదిలో పూలనావలా హాయిగా, సుఖంగా సాగిపోతున్న ఆమే జీవితంలోకి అలజడిలా ప్రవేశించాడు రవీంద్ర. వారింటి పక్క పోర్షన్‌లోకి అద్దెకి వచ్చాడు రవి. పాతికేళ్ళకే ఓ ప్రైవేట్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పెద్ద మొత్తంలో జీతం వచ్చే వుద్యోగం అతనిది. గ్రామంలో బోలెడు ఆస్తిపాస్తులు గల తల్లిదండ్రులకి ఏకైక సంతానం. చక్కని రూపంతో కన్నెపిల్లల కలల రాకుమారుడులా వుంటాడతను. అక్కడికి అద్దెకి వచ్చిన నెలకే ఆ వీథిలోని అందరికీ ప్రీతిపాత్రుడైపోయాడతను.

పిల్లలయితే "రవి అంకుల్" అంటూ సాయంత్రాలు అతని చుట్టూ చేరిపోతారు. సండే వస్తే ఆ ఆవరణంతా పిల్లల సందడే. వాళ్ళకి చాక్లెట్లు, బిస్కెట్లు అని అతని గదిలో డబ్బాలకొద్దీ తెచ్చి పెట్టేవాడు. మాధురి, మాధవ్‌ల నాలుగేళ్ళ బాబు చింటూకయితే అతని దగ్గరకెళితే ఇక ఇంటి ధ్యాసే వుండదు.

మాధురి బలవంతాన లాక్కురావలసిందే.

అయితే మాధురికి అతని ఎదుట పడాలంటేనే ఏదోలా వుండసాగింది. వచ్చిన మొదటి రోజే తాళం అడిగేందుకని వచ్చి నతను తలుపు తెరిచిన ఆమె వంక చూస్తూ అలాగే నిలుచుండిపోయాడు. ఆ రోజు నుంచే అతని చూపులు, ఆ చూపుల్లోని ఆరాధన ఆమెకు ఇబ్బందికరంగానే వున్నాయి.

మాధవ్ కూడా స్నేహశీలి కావడంతో ఆ రెండు ఇళ్ళ మధ్య పరిచయం స్నేహంగా మారిపోయింది. అలా మాధవ్, చింటూల కోసమని వేరుగా వచ్చి హాల్లో కూర్చుని వాళ్ళతో కబుర్లేసుకునేవాడు రవి.

మాధురి ఏకాంతంగా వుంటే మాత్రం తన అభిమానం, ఆరాధన మాటల్లో వ్యక్తపరిచెయ్యటం

కూడా మొదలెట్టాడు. అదేదో అసభ్యంగానో, వెకిలితనంగానో వుంటే మొదటి రోజే అతని చెంప చెళ్ళుమనిపించి బుద్ధిచెప్పి వుండేది మాధురి. కానీ అతని ప్రవర్తన ఎంతో మృదువుగా, ఆరాధనాపూర్వకంగా వుండేది.

మాధురిని ఓ అపురూపమైన సుమరాణిలా చూసేవాడు.

"మీరెంత అందంగా వుంటారో మీకు తెలియదు" అనేవాడు. మాధురి ఆ మాటలువిని పించుకోనట్లే వెళ్ళిపోయేది.

"తన అందాన్ని ప్రశంసిస్తే ఏ స్త్రీకయినా ఆనందం కలుగుతుంది కదా, మీ రెందుకలా చిరాగ్గా చూస్తారు?" అని అడిగాడోసారి.

"పెళ్ళయిన స్త్రీకి తన అందాన్ని గురించిన పొగడ్త తన భర్త నోటంట వింటేనే ఆనందం కలగాలి" కోపంగా చెప్పింది.

"మీరు చాలా గమ్మత్తుగా మాట్లాడుతారు."

"నేను గమ్మత్తుగా మాట్లాడటం కాదు. మిమ్మల్నీ మత్తు వదిలించుకోమంటున్నాను."

"ఇది మత్తుకాదు మాధురీ. నన్ను ఎంతో మంది అందమైన అమ్మాయిలు ప్రేమిస్తున్నామంటూ వెంట పడ్డారు. మీరు వివాహిత అని నా మనసుకెంత నచ్చచెప్పినా వినటం లేదు. చిత్రంగా మీరు నా మనసంతా నిండిపోయారు. మీరు నా అనురాగాన్ని అర్థం చేసుకోరేం?"

"అర్థం చేసుకోవటం వ్యర్థమూ, అనర్థమూ కూడా. నేను వివాహితనే కాదు ఓ బిడ్డకు తల్లిని కూడా నన్న విషయం మీరు మర్చిపోతున్నారా?"


"మీ సన్నిధిలో ఈ ప్రపంచాన్నే మర్చిపోతున్నాను"

ఇక అతనికి నచ్చచెప్పడం, బుద్ధిచెప్పబోవడం వృథా అనుకుని అతనితో మాట్లాడడమే మానుకుంది మాధురి. అతను భర్త కోసమో, పిల్లాడి కోసమో ఇంటికి వచ్చినా వాళ్ళున్న హాలు ఛాయలకే వెళ్ళేది కాదు. అయితే ఆ రెండు పోర్షన్లకూ కలిపి ఒకే కాంపౌండ్ కాబట్టి పెరటిలోనో, ముందు గేటు దగ్గరో తారసపడాల్సి వచ్చినా అతనా ప్రాంతంలో వున్నాడనుకుంటే అక్కడ్నుంచి తప్పుకునేది.

రవీంద్ర పిచ్చెత్తిపోయాడు ఆమె దర్శనం కోసం. పెరట్లో ఆమె పనిచేసుకుంటూంటే కావాలని అటు వెళ్ళేవాడు. అయితే మాధురి చేస్తున్న పనిని మధ్యలోనే ఆపి చటుక్కున ఇంట్లోకి వెళ్ళిపోయేది.

రవీంద్ర కేంచేయాలో అర్థంకాలేదు. ఆమె అలా కనిపించీ కనిపించకుండా వుండడంతో కోరిక మరింత ఎక్కువైంది. ఆమెతో కనీసం మాట్లాడే ఓ చిన్న అవకాశం కోసం తపిస్తుంటే అతని ప్రార్థన ఫలిస్తూ ఆ అవకాశం ఓ రోజు రానే వచ్చింది.

మాధవ్ వూరిలో లేడు ఆ రోజు. రాత్రి పది కావస్తూంది సమయం. బాబు కూడా నిద్రపోవడంతో ఇక మాధురి తనూ అన్నం తిని పడుకుందామనుకుంటున్నంతలో కరెంటు పోయింది. కానీ చుట్టుపక్కల అందరిళ్ళలో వుండడంతో తమ ఇంట్లోనే ఫ్యూజ్ పోయింది కాబోలు. ఇక రాత్రంతా ఫ్యాన్ లేకుండా ఎలారా దేముడా అనుకుంటున్నంతలో బయట డోర్ చప్పుడైంది.




వెళ్ళి తలుపు తీస్తే గుమ్మంలో రవి నిలబడి వున్నాడు.

"ఫ్యూజ్ పోయినట్లుంది. నన్ను చూడమంటారా?" అడిగాడు.

మెయిన్ స్విచ్‌లన్నీ మాధురి వాళ్ళ హాల్లోనే వున్నాయి మరి. ఇక తప్పనిసరి అయి "చూడండి" అంటూ అతనికి ఇంట్లోకి దారి ఇచ్చింది.

అతను టార్చ్ తీసుకుని స్టూల్ ఎక్కి చూసాడు.

"ఫ్యూజ్ వైరుందా మీ దగ్గర. వేస్తాను" అడుగుతూ దిగాడు.

"ఉండాలి. ఆ టార్చ్ ఇటివ్వండి. చూసి ఇస్తాను" అంటూ టార్చ్ కోసం చెయ్యి చాపింది మాధురి.

అలా ఆ చీకట్లో, అంత దగ్గరగా ఒంటరిగా ఎవరూ లేని ఏకాంతంలో ఆమె దొరికేసరికి అతనిలోని కోరిక, ఆవేశం కట్టలు తెంచుకుంది. చటుక్కున ఆమెని దగ్గరకు లాక్కుని తన బాహువుల్లో బంధించాడు. "మాధురీ, ఐ లవ్ యూ.

* "ఎనిమిదేళ్ళ వాడికి ఎల్.కె.జి.లో సీటివ్వనంటే ఇవ్వను. అయినా ఇన్నాళ్ళూ ఏం చేస్తున్నారయ్యా?" అడిగాడు ప్రిన్సిపల్.
"ఎడ్మిషన్ తీసుకోడానికి గానుక్యూలో నుంచుని ఇక్కడికొచ్చేసరికి ఈ వయసొచ్చేసింది!" చెప్పాడు మురళీ!

లవ్ యూ" అతని పెదవులు గొణుగుతున్నాయి.

ఆ హఠాత్ సంఘటనను ఊహించని మాధురి ముందు నివ్వెర పోయింది. ఆమె తేరుకునే సరికి అతని కౌగిలి బిగిసిపోతూంది. అరిచేందుక్కూడా అవకాశం లేకుండా ఆపై అతని పెదవులు ఆమె పెదవులను అదిమేశాయి. వెచ్చగా, మెత్తగా తాకుతున్న ఆమె అందాల ఒంపులు కాంక్షను మరింత పెంచుతూ అతని చేతులకు బలాన్నిస్తున్నాయి. పెనుగులాడింది మాధురి. చివరికి తన శక్తినంతా ఉపయోగించి బలవంతాన అతన్నుంచి విడిపించుకుని ఒక అడుగు వెనక్కి వేసింది.

అయితే "ప్లీజ్ మాధురీ కాదనకు. ఒక్కసారి" అంటూ మళ్ళీ తన వైపు రాబోతున్న అతని చెంప ఈసారి ఛెళ్ళుమనిపించింది మాధురి పిచ్చి కోపంతో.

"యూ రాస్కెల్! ఏమనుకుంటున్నావు నీ మనసులో? నీ చేతులు తగిలిన ఈ శరీరాన్ని ఇప్పటికిప్పుడు నిప్పంటించి చచ్చిపోవాలనుంది" అరిచింది.

అంతే, అతనిలోని ఆవేశమంతా చప్పన ఒక్కసారిగా చల్లారిపోయింది. "మైగాడ్. ఆమె అంత పనీ చేసుకుంటే..."

"వద్దు వద్దు. అంతపని చేయకు" అంటూ ఆమె కాళ్ళ దగ్గర కూర్చుండిపోయాడు.

"ముందు నువ్విక్కడ్నుంచి వెళ్ళిపో. గెటవుట్" మాధురి తన కాళ్ళను కూడా అతనికి తగలనివ్వకుండా వెనక్కి జరుగుతూ అదే కోపంతో అరిచింది. వెళ్ళిపోయాడతను మౌనంగా తల వంచుకుని. ఆ రాత్రికలా ఆ ఇల్లు చీకట్లోనే వుండిపోయింది.

***

మాధురి ఆ మరునాడంతా ఇంట్లోంచి బయటకే రాలేదు. ఆ రెండో రోజుకి పక్క పోర్షన్‌లోకి తమ వీధిలోని వారంతా రావడం, పోవడం, వూరు నుంచి రవీంద్ర తల్లీ తండ్రీ కూడా రావడం

చూసి ఏమిటని అడిగితే తెలిసింది - "రవీంద్ర హై ఫీవర్‌లో వున్నాడని."

ఇరుగూ పొరుగూ అంతా అతని జ్వరం ఎలా వుందని చూసి అడిగిపోతున్నారు. ఒకే ఇంట్లో పక్క వాటాలోనే వున్న తను అసలు వెళ్ళి చూడకపోతే పలుగురిలో ఏం అనుమానాలోనని, అదీగాక చింటూ కూడా "రా మమ్మీ పాపం అంకుల్‌కి ఎంత జరమో, నువ్వూ వచ్చి చూడు" అని గొడవ పెడుతూండడంతో మాధురి వెళ్ళింది అతన్ని చూసేందుకు.

మంచంపై నీరసంగా పడుకుని వున్నతన్ని చూసి ఆశ్చర్యపోయింది. "రెండు రోజుల్లోనే అంత మార్పా?" అని.

ఆమె పాదాలకున్న వెండి పట్టీల సవ్వడికే అంత. వరకూ కళ్ళు మూసుకుని పడుకుని వున్నతను చటుక్కున కనులు తెరిచాడు.

తనను చూడగానే రవీంద్ర కళ్ళలోకి వచ్చిన వెలుగు మాధురి దృష్టిని దాటిపోలేదు.

"రామ్మా! మాధురీ. రా కూర్చో. నువ్వు మాట్లాడుతూండు. నేను ఇప్పుడే స్టవ్‌పై పాలు చూసి వస్తాను" ఆ పక్కన కుర్చీలో కూర్చుని వున్న రవీంద్ర తల్లి మాధురిని కూర్చోపెట్టి వంటగదిలోకెళ్ళింది.

"థాంక్యూ. పరామర్శకు వచ్చినందుకు. నాకు తెలుసు మీరు నా కోసం తప్పక వస్తారని" అతని స్వరం నీరసంగా వున్నా సంతోషంగా పలికింది.

"సారీ, నేను మీ కోసం రాలేదు. చింటూ విసిగిస్తుంటే వచ్చాను. వస్తానిక" మాధురి ఆ మాటలకి చర్రున లేచి ఇవతలకి వచ్చేసింది.

"అదేమిటమ్మాయ్, అప్పుడే వెళ్ళిపోతున్నావు?" రవీంద్ర తల్లి అడిగింది.

"లేదండి. ఇక్కడ కూచుందాం. అక్కడ పాపం మీ అబ్బాయికి జ్వరం బాగా వున్నట్టుంది. మనం మాట్లాడుతూంటే విసుగ్గా వుండొచ్చు."

"ఏం జ్వరమోనమ్మా! హఠాత్తుగా పిల్లాడిలా అయిపోయాడు."

"ప్లీజ్. ఒక్కసారి, ఒక్కసారి నన్ను కరుణించవా" అంటూ ఇంకా ఏవేవో కలవరిస్తున్నాడు జ్వర తీవ్రతలో. వయసులో వున్న పిల్లాడు. త్వరగా పెళ్ళి చేసెయ్యాలండీ అంటే ఈయన ఇంకా సంబంధాలు చూస్తూనే వున్నారు."

ఆమె తన పల్లెటూరి సహజధోరణిలో అందరినీ ఆత్మీయంగా అనుకుంటూ మనసు విప్పి గలగలా మాట్లాడేస్తూంటూంది.

కానీ వింటున్న మాధురి గుండె మాత్రం అర క్షణం కొట్టుకోవడం మానేసింది. "బాప్‌రే. ఇతగాడీ పిచ్చిలో ఏదన్నా కలవరించేసేడంటే తన కాపురం గతేంటి? పలుగురిలో నవ్వులపాలయిపోదూ తన తప్పేమీ లేకుండానే?"

ఇక అపై స్థిమితంగా అక్కడ వుండలేకపోయింది.

"నేను వస్తానండి. పనుంది" అంటూ చెప్పేసి వచ్చేసింది.

***

మరో రెండు రోజులకి అతని జ్వరం తగ్గిపోయిందనీ, ఆ వేళే కాస్త బలవంతాన అన్నం తినిపించినట్టు రవీంద్ర తల్లి వచ్చి చెప్పింది.

అనిడే మళ్ళీ కొద్దిసేపటి తర్వాత వచ్చి "అమ్మాయ్! వెనుక పెరటి తలుపు తీసి వుంచాను. ఇల్లు కాస్త చూస్తూండమ్మా. మేము గుడిదాకా వెళ్ళి వస్తాము. మొక్కు తీర్చాలి. వచ్చి అన్నీ సర్దుకోవాలి

## ఆదిభట్ల హాస్యం

* గిడుగు రామ్మూర్తి పంతులుగారికి ఎవరు ఎంత గట్టిగా చెప్పినా వినబడేది కాదు. సామాన్యమైన చెముడు కాదు– బ్రహ్మ చెముడు. ఓసారి రామ్మూర్తి పంతులుగారిని నా కథకురా అని ఆహ్వానించేరు ఆదిభట్లవారు. "నువ్వు శంఖమూదినా నా చెవులకి వినడదు. నీ కథ ఏం వినగలను?" అని నిరుత్సాహంతో అన్నారట. 'ఇక యిది శంఖనాదం కాదు.. శంఖోనినాదం' అంటూ ఆలపించేరట ఆదిభట్లవారు. అది సైస్థాయి... తారాస్థాయి.. గిడుగువారి చెవుల్లో గింగురుమని మార్మోగిపోయింది. కథ ఆయనకు వినిపించే అంత స్థాయిలో ఆదిభట్ల వారు చెప్పారన్నమాట. బేష్ అన్నారు గిడుగువారు. "నేను గిడుగును. నీవు పిడుగువి. ఇంత కంఠం నాకుంటే గ్రాంధిక వాదుల చెవులలో మొలచి చెట్లను ఎదురగొట్టి వేద్దు" అని చమత్కరించేరట.

-సేకరణ: భమిటిపాటి

కూడా. వేకువ జామున వూరికి వెడుతున్నాము. రవిని మీరే చూసుకోవాలి. గ్రామంలో ఎక్కడి పనులు అక్కడ వదిలేసి వచ్చాము. ఆ, అన్నట్టు చింటూని కూడా పంపరాదూ గుడికి. మేము త్వరగానే వచ్చేస్తాములే" అని చెప్పి పెద్దవాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

అవతల రవీంద్ర ఒంటరిగా వున్నాడు.

"ఇంతకన్నా మంచి సమయం దొరకదు!" ఆ రెండు రోజులుగా ఆలోచించి పెట్టుకుని వున్న పరిష్కారాన్ని అమలులో పెట్టడానికి. మాధురి ధైర్యం చేసి వెంటనే పెరటి వైపు తలుపు తోసుకుని రవీంద్ర గదికి వచ్చింది.

ఏమీ తోచనట్టు మంచంలో పడుకుని ఏదో పుస్తకం తిరగేస్తున్న రవి అలా మాధురి ఎవ్వరూ లేని వేళ చూసి వెనుక మంచి రావడంతో లేచి సరిగ్గా కూర్చుంటూ ఆశ్చర్యంగా చూశాడు.

"ఆశ్చర్యంగా వుందా? నేనిలా రావడం" నవ్వుతూ అడిగింది.

"ప్లస్ ఆనందంగా కూడా వుంది" అతను సంతోషంగా అన్నాడు.

"నేను బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను మీ విషయంలో" ఆగింది.

రవి ఆత్రుతగా ఆమె వంకే చూస్తున్నాడు.

"నేను... మీ కోరిక తీర్చడానికే నిర్ణయించుకున్నాను" అతను ముందు ఒక్క క్షణం తానేం వింటున్నాడో అర్థంకానట్టు అపనమ్మకంగా చూశాడు. అర్థమైన మరుక్షణం కళ్ళలోకి వెలుగు వెల్లువలా వచ్చింది.

"అయితే ఒక షరతు!" ఆమె స్థిరంగా అతన్నే చూస్తూ అన్నది.

"చెప్పండి. మీ కోసం ఏం చెయ్యడానికైనా సిద్ధమే" రవి గొంతులో అప్పుడే తన కోరిక తీరిపోయినంత ఆనందపు ఉద్వేగం.

"ఏమీ లేదు. ఇకపై నేను మీతోనే వుంటాను."

"ఏ... ఏమిటి?!"

"అవును. నాకు డబుల్ గేమ్ ఆడటం ఇష్టం వుండదు. అది ఒక్కసారే అయినా మీరు తాకిన ఈ శరీరాన్ని మళ్ళీ ఏమీ తెలియనిదానిలా నా భర్తకు అర్పించలేను. అయితే ఇటు చూస్తుంటే మీరు నాపై ప్రేమలో పిచ్చివారయిపోతున్నారు. వంశానికొక్కడు. వాడెందుకిలా అయిపోతున్నాడో అంటూ కలతచెందుతున్న మీ అమ్మగారి బాధను చూడలేకపోతున్నాను. అందుకే నేను మీకే చెందాలనుకుంటున్నాను. ఈ క్షణమే అయినా నేను మీతో వచ్చేయడానికి రెడీ!"

మాధురి చెప్పడం ఆపి చిన్నగా నవ్వింది. అయితే రవి మాత్రం షాక్ తగిలిన వాడిలా వుండగానే మాధురి అన్నది.

"ఇప్పుడు మీ కోరిక తీరడం, తీరకపోవడం మీ చేతిలోనే వుంది. బాగా ఆలోచించుకోండి" ఆమె వెళ్ళిపోయింది. కానీ ఆమె మాటలు మాత్రం అతని చెవుల్లో మారుమ్రోగుతూనే వున్నాయి.

***

ఆ మరునాడు వేకువన మామూలుగా లేచి బయట పాల ప్యాకెట్లు తీసి లోపల పెడదామని తలుపు తెరిచిన మాధురికి గుమ్మానికి పక్కగా ఓ అరవిరిసిన గులాబీ, దాని కిందో కాగితం కనిపించాయి.

వంగి కాగితాన్ని చేతిలోకి తీసుకుంది. అప్పుడప్పుడే విచ్చుకుంటూన్న వెలుగురేఖల్లో ఆ అక్షరాలను చదివింది.

"మాధురి గారికి,

ముద్దులొలికే ఓ పచ్చని పొదరింటికి నిప్పంటించి నా చలిమంటను తీర్చుకోలేను. ఇంకెప్పుడూ మీకు కనిపించను, వి సిగించను.

సెలవు, రవీంద్ర" అని వుంది.

పక్క పోర్షను వైపు చూసింది. తాళం వేలాడుతూంది. అది తానాశించిన, ఊహించిన ముగింపే కాబట్టి ఆమె మెల్లగా, రిలీఫ్‌గా నవ్వుకుంది.